క్లుప్తంగా

అన్నప్రసాద వితరణకు విరాళం



అన్నపూర్ణ సంఘానికి విరాళం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు నక్కవీధికి చెందిన నక్క శంకరరావు తన తల్లి అప్పన్నమ్మ జ్ఞాపకార్థం రూ.10 వేలు వితరణగా అందజేశారు. అడ్వకేట్ దండుగుల పార్థసారధి ద్వారా ఈ మొత్తాన్ని సంఘం కార్యదర్శి కిల్లాన పాల్గుణరావుకు అందచేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖశర్మను కలిసిన అంధవరపు



షణ్ముఖశర్మతో అంధవరపు సూరిబాబు

శ్రీకాకళం కల్చరల్: ప్రముఖ ప్రవచన కర్త, రుషి పీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మను వైఎస్సార్‌సీపీ నాయకుడు, శర్వాణీ విద్యాలయం వ్యస్థాపకుడు అంధవరపు సూరిబాబు సోమవారం కలిశారు. ఆయన ఉంటున్న గుమ్మా నగేష్ ఇంటి వద్దకు వెళ్లి ఆశీర్వాదం పొందారు.

చిన్నారికి చక్రాల కుర్చీ అందజేత



చక్రాల కుర్చీని చిన్నారి లిఖితకు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని వైష్ణవ వీధికి చెందిన ఎలమిల్లి పద్మ కుమార్తె లిఖిత నడవలేని స్థితిలో ఉండగా ఆమెకు సోమవారం చక్రాల కుర్చీని రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు అందజేశారు. లిఖిత పరిస్థితి తెలుసుకున్న రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధి నంది ఉమాశంకర్ విశాఖలోని రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ సభ్యులతో మాట్లాడి వారందించిన సహకారంతో రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహన్‌రావు చేతుల మీదుగా చిన్నారికి చక్రాల కుర్చీని అందచేశారు. దీంతో సాయం అందించిన రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షుడు మాదుగుల రేణుక, హరికృష్ణతో పాటుగా ఇతర సభ్యులకు ధన్యవాదాలను తెలిపారు. జిల్లాలో ఎవరికైనా ఇటువంటి సాయం కావాలంటే 97016 98408 నంబరుకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, ఏవో ఎ.నరసింగరావు, మేనేజర్ బి.సతీష్, మేనేజర్ ఆయేషా బేగం, హర్ష, పవన్‌కుమార్, చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళ దాతకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి నగరానికి చెందిన పల్లా అప్పలనాయుడు, కళావతి దంపతులు నిత్యాన్నదాన పథకం కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ఈవో వై.భద్రాజీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మకు అందజేశారు.

సూర్యారాధనతో ఆరోగ్యం



దుర్గాసప్తశతి గ్రంథావిష్కరణ చేస్తున్న షణ్ముఖశర్మ

శ్రీకాకుళం కల్చరల్: సూర్యారాధనతో ఆరోగ్యం, ఐశ్వర్యం పొందవచ్చని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త, రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ఉపనిష్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో శ్రీసూర్య దర్శనంపై 5 రోజుల ప్రవచన యజ్ఞం మూడో రోజు సోమవారం జరిగింది. అంతకుముందు హైదరాబాద్‌కు చెందిన కర్రి భాస్కరరావు రచించిన శ్రీదుర్గా సప్తశతి గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, సుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, గుత్తు చిన్నారావు, నిక్కు హరిసత్యనారాయణ, తెన్నేటి విక్రమశర్మ, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కప్పగంతుల వెంకటరమణారావు, వి.కామేశ్వరరావు, పి.బాబూరావు, సనపల నారాయణమూర్తి, నిక్కు హరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దున్నకుండా సాగు.. దిగుబడి బాగు..!



జీరో టిల్లేజ్‌లో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న దృశ్యం

- టీరో టిల్లేజ్‌పై రైతుల ఆసక్తి
- విరివిగా మొక్కజొన్న సాగు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సాగు చేసిన మొక్కజొన్న పంట

జి.సిగడాం: ప్రస్తుతం రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. దీంతో జీరో టిల్లేజ్‌లో భాగంగా దుక్కు దున్నకుండా విత్తనాలు నాటడం వలన అధిక దిగుబడులు సాధిస్తున్నారు. అన్ని పంటల కంటే మొక్కజొన్న పంట సాగు ఈ విధానంలో ఎక్కువగా చేస్తున్నారు. మండలంలోని పెంట గ్రామంలో జీరో టిల్లేజ్ ద్వారా మొక్కజొన్న విత్తనాలను వేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా కూలీల ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నీటిని కూడా ఆదా చేస్తున్నారు. వరి పంట కోత అయిపోయిన వెంటనే ఈ పద్ధతి అవలంభిస్తే మొక్కజొన్న పంట దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

ఆశాజనకంగా మొక్కజొన్న

మండలంలోని రైతులు జీరో టిల్లేజ్‌లో మొక్కజొన్న పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే గేదెలపేట, సీతంపేట, నక్కపేట, నాగులవలస, మెట్టవలస, చెట్టుపొదిలాం, పెంట, పాలఖండ్యాం, జాడ, బాతువ గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో సుమారుగా 5 వేల ఎకరాల్లో రైతులు పంట వేస్తున్నారు. ఈ విధానంలో ఎకరాకు సుమారుగా 38 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు మొక్కజొన్న దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

కలుపు నివారణ ఇలా..

వరిపొలంలో భూమిని దుక్కుదున్నడం చేయకపోవడంతో కలుపు ఎక్కువగా వస్తుంది. దీని నివారణకు ఒక్క కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. కోసిన వరిదుబ్బు మొలకెత్తకుండా ఉండటానికి లీటర్‌కు 5 మీ.లీ చొప్పున్న పారాక్వాట్ మందును నీటిలో కలిపి విత్తిన మరుసటి రోజు పిచికారీ చేయాలి. అట్రాజిన్+పారాక్వాట్ కలిపి కూడా పిచికారీ చేయవచ్చు.

మంచి దిగుబడి వస్తుంది



జీరో టిల్లేజ్ ద్వారా మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. ఎటువంటి ఖర్చులు పెట్టకుండా కుటుంబ సభ్యులతోనే పంటను సాగు చేసుకున్నాం. గతేడాది ఒక్కొక్క పొత్తుకు 450 గింజలు దిగుబడి వచ్చింది. సుమారుగా ఎకరాకు 35 బస్తాలు మొక్కజొన్న పంట సాధించాం.

– బాలి అప్పలసూరి, నడిమివలస, జి.సిగడాం

రబీలో మంచి దిగుబడి



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట దిగుబడులు కంటే రబీలో వేసిన మొక్కజొన్న దిగుబడులు 90 శాతం వరకు అధిక లాభాలు వస్తాయి. గతేడాది రబీలో వేసిన మొక్కజొన్న ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. దీనితో ప్రతీ సంవత్సరం రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నాం.

– వడిశ మహేశ్వరరావు, విజయరాంపురం, జి.సిగడాం

సూచనలు తీసుకుంటున్నారు



సీతంపేట, గేదెలపేట, నక్కపేట, పెంట గ్రామ రైతులతో పాటు మండలంలోని పలువురు సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లోకి వెళ్లి పంటలపై పలు కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు అనువైన పంటలను గుర్తించి పంట పొలాల్లో వేయిస్తున్నాం.

– యర్రా శారద, ఏవో, జి.సిగడాం

మహా కుంభాభిషేకం ప్రారంభం



ప్రారంభ పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బోడెమ్మ కోవెలలోని జీవేశ్వరాలయంలో శివ పంచాయతన సహిత రుద్ర యాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు వేంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు రంగా భట్ల శ్రీను, అనిల్‌శర్మ, కె.శ్రీను పర్యవేక్షణలో గణపతి పుజ, సహస్ర లింగార్చన, గణపతి, చండీ, రుద్ర మహాసౌర వాస్తు యోగిని, మండప పూజలు, సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్రా వెంకటరావు, తాళాడ రవీంద్ర, బస్వా రవి, యాగాటి ప్రసాద్, చిత్రడ గాంధీ, బబ్బాది లక్ష్మణరావు, రాయితి చంద్రశేఖర్, గణగళ్ల కొర్లయ్య, శిల్లా శ్రీరామమూర్తి, తంగుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శివోహం..!

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివనామ స్మరణ మార్మోగింది. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పుణ్య స్నానాలు ఆచరించి శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రుడికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గిరిజా ముక్కంటీశ్వర ఆలయంలో భక్తుల పూజలు



శ్రీకాకుళం కల్చరల్: రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

లక్షవత్తుల దీపారాధన

శ్రీకాకళం కల్చరల్: స్థానిక బొంతావారి వీధిలో ఉన్న శ్రీకృష్ణార్జున మందిరం ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సామూహిక లక్ష వత్తుల దీపారాధన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. నిర్వాహకుడు మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా 101 లీటర్ల పాలు, పంచామృతాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం చేపట్టారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అల్పాహారం అందజేయడం జరిగింది.



సాముహిక దీపారాధనలో మహిళలు

పరామర్శ



రణస్థలం: బాధితులకు దుస్తులు అందజేస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని దేరసాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమై, సర్వం కోల్పోయిన మహాలక్ష్మి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. వారికి దుస్తులు అందజేశారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఆయనతో పాటు సర్పంచ్ మీసాల రామారావు, నాయకులు దన్నాన శ్రీనివాసరావు, లక్ష్మన్నాయుడు ఉన్నారు.

బాధితులను ఆదుకోవాలి

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. గ్రామంలోని బాధితులను సోమవారం పరామర్శించి బాధిత కుటుంబాలకు దుస్తులు ఇతర సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, పిల్లల శివకుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, చందనాల రంగారావు, సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, దారబోయిన ధర్మారావు, పున్నాన అక్కలనాయుడు, చిత్తిరి మోహన్, నాయకులు ఏర్నేన ప్రకాశరావు, పెద్ది భాస్కరరావు, బాలి అప్పలసూరి, మక్క సాయి, గేదెలనారాయణరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ సోషల్ టీచర్‌గా మక్కా శ్రీను



సత్కారం అందుకుంటున్న సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ అవార్డును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దపాడు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు మక్కా శ్రీనివాసరావు అందుకున్నారు. విజయనగరంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ నిర్వహించిన సాంఘికశాస్త్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పాఠశాల విద్య ఆర్జేడీ బి.విజయ భాస్కర్, ఫోరమ్ రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సోషల్ సబ్జెక్టులో వినూత్న, సాంకేతికను జోడించి బోధిస్తుండటం, రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా, డాట్ పరీక్షా పత్రాల రూపకల్పన చేసే బృందంలో సభ్యుడిగా వ్యవహరిస్తున్న శ్రీనివాసరావు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పక్షాన విశిష్ట సేవలు అందిస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

మంత్రిని కలిసిన వర్సిటీ అధికారులు



పరిపాలన భవనం నమూనా మంత్రికి అందజేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజినితో పాటు అధికారులు సోమవారం కలిశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.15 కోట్ల అడ్వాన్స్ నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరారు. రూ.38 కోట్లతో నిర్మించిన పరిపాలన భవనం పూర్తయ్యిందని, త్వరలో ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో సిక్కోలు సత్తా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం విజయపరంపర కొనసాగుతునే ఉంది. 2024–25 సీజన్‌లో దాదాపు అన్ని క్రీడాంశాల్లోనూ జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో విజయదుందుబీ మోగిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పల్నాడు జిల్లా కారంపూడి వేదికగా ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో, శ్రీకాకుళం బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచి సత్తాచాటింది. రన్నరప్ టైటిల్‌తోపాటు రజత పతకాలు, ప్రసంశాపత్రాలు అందుకున్నారు. వీరికి కోచ్ మేనేజర్లగా వ్యవహరించిన పీడీలు టి.ఈశ్వరరావు, పి.సత్యవతి ముందుండి నడిపించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, ఖోఖో సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదమరిస్తే అంతే...



ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ముందు పాత జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, వర్సిటీ ప్రహరీల మధ్య డ్రైనేజీ ఉంది. ఈ డ్రైనేజీపై గతంలో సిమెంట్ పలకలు వేశారు. ప్రస్తుతం ఈ పలకలు పాడయ్యాయి. వాహన చోదకులు అప్రమత్తంగా లేకుంటే కాలువలో పడిపోయే అవకాశం ఉంది. ఈ డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

విద్యార్థినుల క్షేత్ర పర్యటన



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల విద్యార్థినుల క్షేత్ర పర్యటన జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళంలోని సహకార బ్యాంకుకు క్షేత్ర పర్యటన చేశారు. సహకార బ్యాంకు పనితీరు, విధి విధానాలు, రుణాలు, డిపాజిట్ల గురించి సీఈవో వరప్రసాద్‌ను విద్యార్థులకు తెలియజేశారు. ఎకనామిక్స్ హెచ్‌వోడీ టి.ఆదిలక్ష్మి, లెక్చరర్స్ డాక్టర్ బి.ప్రభాకరరావు, బీఏ హెచ్‌ఈపీ 5వ సెమిస్టర్ విద్యార్థినులు ఉన్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ

అయ్యప్ప తిరువీధి



గార మండలంలోని దీపావళి గ్రామంలో హరిహరసుత అయ్యప్ప తిరువీధి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్థానిక శ్రీధర్మశాస్త్ర జ్ఞానాశ్రమం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సన్నిధానంలో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. శ్రీబాల త్రిపుర కాలభైరవ పీఠం వ్యవస్థాపకులు గణేష్ గురూజీ, అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.

– గార

హామీల అమలు ఎన్నడు..?

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. మండలంలోని సంతవురిటి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి, ఇన్ని రోజులు గడుస్తున్నా పేదల సంక్షేమం కోసం పట్టించుకోవడం లేదన్నారు. ఎల్లప్పుడూ ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. సంక్షేమాన్ని పక్కనబెట్టి రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ప్రజల పక్షాన పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అనునిత్యం అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఆయనతో పాటు సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, పిల్లల శివకుమార్, పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, చందనాల రంగారావు, సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, దారబోయిన ధర్మారావు, పున్నాన అక్కలనాయుడు, చిత్తిరి మోహన్, నాయకులు ఏర్నేన ప్రకాశరావు, పెద్ది భాస్కరరావు, బాలి అప్పలసూరి, మక్క సాయి, గేదెలనారాయణరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మహిళలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి సంతోషిమాత గుడి వరకు నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక కార్యక్రమాలు నెల రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వైద్యారోగ్య శాఖ, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో వన్ స్టాప్ సెంటర్ ఉందని మహిళలకు సంబంధించి కుటుంబ సమస్యలు ఉంటే న్యాయ సహాయం కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా మహిళలపై గృహహింస లేదా పని చేసే స్థలాల్లో హింస జరిగితే ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మెరిట్ స్కాలర్ షిప్ కోసం ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: బెంగుళూరుకు చెందిన శిక్షణ ఫౌండేషన్ ఆఫరేషన్ సంస్థ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీలో ఈఈఈ ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు వర్చువల్ పద్ధతిలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు చేశారు.

తనపై దాడిచేశారని మహిళ ఫిర్యాదు

గార: తనపై అంబళ్లవలస గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని పూసర్లపాడు గ్రామానికి చెందిన జన్నాడ గున్నమ్మ ఫిర్యాదు చేసింది. పొలం పనుల వద్ద జరిగిన వివాదంలో తనను గాయపరచడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. దీనిపై అవుట్‌పోస్టు పోలీసుల సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఆర్.జనార్ధన తెలిపారు.

ముగిసిన ఐదు రోజుల శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సేంద్రీయ సాగు కార్యకర్తల ఐదు రోజుల శిక్షణ సోమవారం ముగిసింది.జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రేవతి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు పర్యవేక్షించారు.

మహిళలపై వివక్ష విడనాడాలి

ఎచ్చెర్ల: మహిళలపై వివక్షను విడనాడాలని లావేరు తహసీల్దార్ ఎన్ని జోగారావు సూచించారు. లావేరులో లింగ భేదంపై ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

గార: యువత మత్తు పదార్థాలకు బానిసలు అవ్వకూడదని ఎస్‌ఐ ఆర్.జనార్ధన అన్నారు. సోమవారం సాయంత్రం అంపోలు పంచాయతీ లింగాలవలసలో సంకల్పం పేరిట అవగాహన సమావేశం నిర్వహించారు.

చలో శ్రీకాకుళం విజయవంతం చేయండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈనెల 29న చేపట్టనున్న చలో శ్రీకాకుళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విజ్ఞాన్ మందిర్ ఇల్లిసిపురంలో గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మూడో ఏడాది చదువుతున్న విద్యార్థి సీహెచ్ శరత్ కుమార్ గాయపడ్డారు. పరీక్షలు రాసేందుకు తోటి విద్యార్థులతో కలిసి నడుస్తూ వెళ్తుండగా, శ్రీకాకుళం వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుల గణన చేపట్టాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ, ఇతర కులాలవారీగా కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతిపత్రం అందజేశారు. అన్ని ప్రభుత్వ రంగం సంస్థల్లోనూ, రాజకీయాల్లోనూ కులం జనాభా ప్రాతిపదిక ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఉత్సాహంగా పెన్‌కాక్ సిలాట్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి పెన్‌కాక్ సిలాట్ క్రీడా పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. శ్రీకాకుళంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులపాటు జరిగిన 1వ జిల్లా స్థాయి ఇంటర్ స్కూల్ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడ జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించిన సాధించిన క్రీడాకారులు డిసెంబర్ 15వ తేదీన విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధించారు.